భోగేశ్వరంలో సండే సందడి

- కిటకిటలాడిన ఆలయ ప్రాంగణాలు
- ఉదయం నుంచి రాత్రి వరకు నిర్విరామంగా దర్శనం



భోగేశ్వరస్వామివారికి అభిషేకం చేస్తున్న భక్తులు

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన శ్రీ దుర్గాభోగేశ్వరాలయం కార్తీక మాసం ఆదివారం కావడంతో భక్తులతో కళ కళలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు భోగేశ్వరానికి తరలివచ్చారు. ఆలయ పరిధిలోని పంచకోనేర్లలో స్నానం ఆచరించి కార్తీక దీపాలను వెలిగించారు. అభిషేక ప్రియుడైన ఈశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. ఆలయ చైర్మన్ ఐసాని సునీల్‌కుమార్‌రెడ్డి, ధర్మకర్తలు భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి ప్రారంభమైన భక్తుల దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది. కార్తీకమాసం, ఆలయ విశిష్టత గురించి ఆలయప్రధాన అర్చకులు శ్యాంసుందరశర్మ భక్తులకు వివరించారు. భోగేశ్వరున్ని దర్శించుకున్న భక్తులకు కాశీరెడ్డినాయన ఆశ్రమం, ఆర్యవైశ్య సత్రాలలో భోజన సౌకర్యం కల్పించారు.



ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు,



భోగేశ్వరం ఆలయంలోని ప్రధాన కోనేరులో స్నానం ఆచరిస్తున్న భక్తులు

నేడు మహామాస శివరాత్రి

దుర్గాభోగేశ్వరాలయంలో కార్తీకమాసం చివరిరోజు, మహా మాస శివరాత్రితో సమానమని ఆలయ ప్రధానార్చకులు శ్యాంసుందర్‌శర్మ ఆదివారం తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వామివారి దర్శించుకుని శివానుగ్రహం పొందాలన్నారు.

కాల్వబుగ్గలో కార్తీక పూజలు

ఓర్వకల్లు: కార్తీక మాసం సందర్భంగా ఆదివారం మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానంలో కార్తీక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు క్లౌ లక్ష్మీనారాయణశర్మ, నరసింహశర్మలు స్వామి, అమ్మవార్లకు అభిషేకార్చనలు నిర్వహించారు. సాయంత్రం పొదుపు లక్ష్మి ఐఖ్య సంఘం గౌరవ సలహాదారురాలు విజయ భారతి ఆధ్వర్యంలో పొదుపు మహిళలు స్వామి వారికి అభిషేకాలు చేశారు. స్థానిక పుష్కరిణిలో స్నానాలు ఆచరించి ధ్వజస్తంభం వద్ద జ్యోతులను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

కొత్తూరు భక్త సంద్రం...

పాణ్యం : మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం ఆదివారం భక్త సందోహం అయ్యింది. కార్తీక మాసం చివరి ఆదివారం కావడంతో భక్తులు ఆలయానికి పోటెత్తారు. తెల్లవారుజామున నుంచే ఆలయానికి వేలాదిగా భక్తులు తరలిచవ్చారు. కార్తీక మాసం చివరి ఆదివారం కావడంతో ఉదయం 9 గంటలకే క్యూలైన్‌లు, తాత్కలిక క్యూలైన్‌లు నిండిపోయాయి. వందల అభిషేకాలు జరిగాయి. అధికారులు లెక్కల ప్రకారం 30వేలకుపైగా మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు తెలిపారు. ప్రత్యేకంగా తయారు చేసిన దద్దోజనం, లడ్డూ, ఇతర ఆహర ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.



వెండి పడిగెను బహూకరిస్తున్న దృశ్యం



కాల్వబుగ్గలో స్వామి వారికి అభిషేకం చేస్తున్న భక్తులు



ఏకాంత సేవలో స్వామివారికి నైవేద్య పూజలు

సుబ్రహ్మణ్యేశ్వరుడికి బంగారు, వెండి బహుకరణ

శ్రీ వల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి వారికి పాణ్యం మండలం కొనిదేడు గ్రామానికి గండికోట రామనాయుడు, వారి ధర్మపత్ని లక్ష్మీదేవి 20గ్రాముల 800మిల్లీగ్రాముల బంగారు పుస్తెతాళిబొట్టు బహుకరించారని ఈఓ రామకృష్ణ తెలిపారు. అలాగే నంద్యాల పట్టణానికి చెందిన సి. సురేష్ 2 గ్రాములు 600మిల్లీ గ్రాముల చిన్న బంగారు చుట్టి పడిగె, కర్నూలు మండలం, బి. తాండ్రపాడు గ్రామానికి చెందిన నరేష్ కృష్ణాయాదవ్ కుమారుడు లోకాంక్షకృష్ణయాదవ్ 795గ్రాముల వెండి నాగ పడిగెను బహుకరించినట్లు చెప్పారు. దాతల కుటుంబాలను ఈఓ, అర్చకులు సన్మానించారు.

క్లుప్తంగా

నోరుతెరుచుకున్న 'మ్యాన్ హోల్'



ఛత్రీబాగ్ మసీదు వద్ద నోరు తెరుచుకుని ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోల్

కర్నూలు(న్యూటౌన్): కర్నూలు ఓల్డ్‌సిటీలోని ఛత్రీబాగ్ మసీదు వద్ద నెల రోజులుగా మ్యాన్‌హోల్ నోరు తెరుచుకుని ప్రమాదకరంగా ఉంది. అటువైపుగా ప్రతి రోజూ నడుచుకుంటూ స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు, వివిధ పనుల నిమిత్తం వెళ్లే స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదవశాత్తు మ్యాన్‌హోల్‌లో పడి చాలా మంది పిల్లలు గాయాలపాలయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు నగర పాలక సంస్థ అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌కు మూతవేయాలని కోరుతున్నారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: మండలంలోని దివ్యాంగుల ఉపయోగార్థం నిర్వహించే ఫిజియోథెరపీ క్యాంప్‌ను దివ్యాంగులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జ్యోతి ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. స్థానిక భవిత కేంద్రంలో ప్రతి సోమవారం దివ్యాంగులకు వైద్యుడు వీరేష్‌చే ఫిజియోథెరపీ నిర్వహించడం జరుగుతుందన్నారు.

నృత్య 'సంబరం'



నృత్య రూపం ప్రదర్శిస్తున్న కళాశాల విద్యార్థులు

కర్నూలు కల్చరల్: శ్రీ వెంకటేశ్వర సంగీత నృత్య కళాశాల 7వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో జరిగిన ఈ వేడుకలో కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు విశేషంగా అలరించాయి. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులకు కళా రంగం ఆహ్లాదంతో పాటు మానసిక వికాసం కలిగిస్తుందన్నారు. మహిళలే సంగీత నృత్య కళాశాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కళాశాల నిర్వాహకులు మల్లేశ్వరి మాట్లాడుతూ కర్నూలు ఎన్నార్‌పేటలో ఆరు సంవత్సరాల క్రితం తమ సంస్థను ప్రారంభించామన్నారు. వంద మందికి పైగా బాలబాలికలు శాస్త్రీయ సంగీతం, నృత్యం నేర్చుకుంటున్నారన్నారు.

పౌర హక్కులను పరిరక్షించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాలు, న్యాయవాదులు తదితరులు

కర్నూలు(సెంట్రల్) : నేడుభారత్‌తో సహా ప్రపంచ దేశాల్లో పౌర హక్కులు హరించబడుతున్నాయని, ఇందుకు ప్రభుత్వాలు వ్యవహరించే తీరే కారణమని సీనియర్ న్యాయవాది కె.ఓంకార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం అంబేడ్కర్ సర్కిల్‌లో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పౌర చైతన్య వేదిక సిటీ ఇన్‌చార్జ్ తేజోవతి అధ్యక్షతన న్యాయవాదులు, మహిళలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..పాలస్తీనాపై అత్యంత కిరాతకంగా ఇజ్రాయెల్ వ్యవహరించినా ప్రపంచ దేశాలు మిన్నకుండి పోవడం అన్యాయమన్నారు. మనదేశంలో మోదీ అధికారంలోకి వచ్చాక ప్రజాస్వామ్యవాదులు, కవులు, కవయిత్రులపై కేసులు నమోదు చేసి వారి హక్కులకు భంగం కలిగిస్తున్నా ఏమి చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. ఐపీసీ, సీఆర్‌పీసీ, ఎవిడెన్స్ చట్టాలలో ప్రభుత్వం తీసుకొస్తున్న సవరణలు అప్రజాస్వామికమైనవన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన ప్రజాస్వామ్యాన్ని, మానవ హక్కులను పరిరక్షించడానికి ప్రజలు ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది ఎంఆర్ కృష్ణ, ఓపీడీఆర్ జిల్లా అధ్యక్షుడు కరుణాకర్, నాయకులు షాబుద్దీన్, బాబుసాహెబ్, మధన్‌రెడ్డి, ఖాదర్‌బాషా, నాగన్న, ప్రియాంక, రోజా పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలపై పోరాటాలు ఉధృతం

కర్నూలు(సెంట్రల్) : 104 ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలను ఉధృతం చేస్తామని 104 యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో యూని యన్ కోశాధికారి చంద్రహాస్ అధ్యక్షతన 104 ఉద్యోగుల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..104 ఉద్యోగ వ్యవస్థను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. ఉద్యోగులకు పీఎఫ్, ఈఎస్‌ఐ సదుపాయం కల్పించాలన్నారు. 104లో పనిచేస్తున్న డీఈఓలకు వెయిటేజీ మార్కులు ఇచ్చి ప్రభుత్వం ఉద్యోగులకు ప్రాధాన్యం కల్పించాలన్నారు. యూనియన్ జిల్లా కార్యదర్శి పెద్దయ్య మాట్లాడుతూ..ఇప్పటి వరకు యూనియన్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అనేక ప్రయత్నా లు చేసిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు పాల్గొన్నారు.

పరిశోధనలతో సృజనాత్మకత పెంపొందుతుంది

కల్లూరు: సబ్జెక్టులపై పరిశోధన చేయడం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని కర్నూలు జిల్లా గురుకుల పాఠశాలల సమన్వయ అధికారిణి శ్రీదేవి అన్నారు. ఆదివారం కల్లూరు మండలం చిన్నటేకూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సైన్స్, గణితం, ఇంగ్లిషు, తెలుగు సబ్జెక్టుల్లో విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదువు కుంటే మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. విద్యార్థులు సైన్స్ విభాగంలో రాడార్, ట్రాఫిక్ నిబంధనపట్ల అవగాహన, ఫింగర్ ప్రింట్ వల్ల దొంగతనాలు చేసిన వారిని గుర్తించడం, పసి పిల్లలను మార్చినప్పుడు గుర్తించడం, బ్లైండ్ స్టిక్, విషవాయువుల ఉనికిని గుర్తించడం, అగ్ని ప్రమాదాల నివారణకు సంబంధించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అలాగే గణిత ప్రదర్శనలు, తెలుగు, ఇంగ్లిషు వ్యాకరణ అంశాలను సులువుగా నేర్చుకునే అంశాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులు తయారి చేసిన నమూనాలను పరిశీలిస్తున్న గురుకుల సమన్వయాధికారి శ్రీదేవి

మెలకువలతో ప్రాణాలు కాపాడవచ్చు



బీఎల్‌ఎస్‌పై శిక్షణలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): అత్యవసర పరిస్థితుల్లో చిన్న చిన్న మెలకువల ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని మెడికవర్ హాస్పిటల్ ఎమర్జెన్సీ డిపార్ట్‌మెంట్ అధిపతి డాక్టర్ టీవీ సునీల్ యాదవ్ చెప్పారు. మెడికవర్ హాస్పిటల్‌లో రెండు రోజులుగా అమెరికన్ హార్ట్ అసోసియేషన్ సహకారంతో వివిధ ఆసుపత్రుల సిబ్బందికి నిర్వహిస్తున్న బేసిక్ లైఫ్ సపోర్ట్, అడ్వాన్స్‌డ్ కార్డియాక్ లైఫ్ సపోర్ట్ కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా డాక్టర్ టీవీ సునీల్ యాదవ్ మాట్లాడుతూ గోల్డెన్ అవర్‌లో అత్యవసరపు మెళకువలు పాటించేందుకు ఇలాంటి శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రాణాపాయస్థితిలో ఉన్న వారిని ఆసుపత్రికి తరలించేలోపు కొన్ని చిన్న మెళకువల ద్వారా అత్యవసర స్థాయి ప్రథమ చికిత్స అందించి కాపాడవచ్చని తెలిపారు. దీన్నే వైద్యపరిభాషలో బీఎల్‌ఎస్ అని అంటారన్నారు. ప్రాణాపాయ స్థితిలో నుంచి వీలైనంత త్వరగా రక్షించి సీపీఆర్ చేయగలగాలన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ క్లస్టర్ హెడ్ వై.మహేశ్వరరెడ్డి, సెంటర్ హెడ్ పి. నీలారెడ్డి, ఆపరేషనల్ హెడ్ ఇమ్రాన్, డీఎస్. అరుణ, డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ రాఘవ పాల్గొన్నారు.

ఘనంగా ధన్వంతరి జయంతి

కర్నూలు(హాస్పిటల్): విశ్వమానవాళికి ఆయుర్వేద శాస్త్రాన్ని అందించిన భగవాన్ శ్రీ ధన్వంతరి జయంతిని ఆదివారం స్థానిక వన్‌టౌన్‌లోని గీతా మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఆరోగ్యభారతి కర్నూలు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయుర్వేద వైద్యులతో పాటు నగర ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆరోగ్యభారతి జిల్లా ఉపాధ్యక్షుడు, సీనియర్ వైద్యాధికారి డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆయుర్వేదం గొప్పతనం గురించి వివరించారు. మన ప్రాచీన చరిత్రలో వైద్యులుగా ఉన్న సుశ్రుతుడు, చరకుడు మొదలైన వారి గురించి పేర్కొన్నారు. వారి తర్వాత అత్రి, బృహస్పతి, కవి, చంద్ర, వరుణ, మను, ఇక్ష్వాకు మొదలైన వారు ఆయుర్వేద పరంపరను కొనసాగించారన్నారు. అంతుచిక్కని వ్యాధులతో శరీరం పీడించబడుతున్నప్పుడు దీర్ఘకాలిక రోగాలు పట్టి విడువనప్పుడు ధన్వంతరిని పూజిస్తే ఉపశమనం కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్యభారతి ఏపీ సభ్యులు డాక్టర్ ఎండీపీఎస్. రామశర్మ, ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి, జిల్లా కార్యదర్శి బి. సత్యనారాయణరెడ్డి, జిల్లా సహ కార్యదర్శి స్వప్న, పార్థసారథి పాల్గొన్నారు.



ధన్వంతరి చిత్రపటానికి పూజలు నిర్వహించిన ఆరోగ్యభారతి సభ్యులు

బీజేపీ పాలనలో దళితులపై దాడులు

కర్నూలు(సెంట్రల్) : బీజేపీ పాలనలో దళితులపై దాష్టికాలు అధికమయ్యాయని డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మహేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం నగరంలోని 19వ వార్డు పరిధిలో ఉన్న నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీలో దళిత హక్కుల పోరాటసమితి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో దళితులపై దాడులు అధికమైనట్లు స్వయంగా కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్‌సీఆర్‌బీసీ వెల్లడించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కుమార్‌రాజా, రామచంద్ర పాల్గొన్నారు.

కోడుమూరులో యువకుడి హత్య



మృతి చెందిన యువకుడు రవి

కోడుమూరు రూరల్ : కోడుమూరులోని పాతబస్టాండ్ సమీపంలో ఓ యువకుడిని కత్తితో పొడిచి హత్య చేసిన సంఘటన ఆదివారం రాత్రి 10గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కోడుమూరుకు చెందిన బోయ బజారి కుమారుడు రవి (24) గౌండ పనిచేస్తూ జీవనం సాగించేవాడు. రాత్రి యువకుడు రవి పాతబస్టాండ్ వద్ద ఉండగా గుర్తు తెలియని దుండగులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దీంతో స్థానికులు, తోటి స్నేహితుల తీవ్రంగా గాయపడిన రవిని కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు. దీంతో మృతుడు కుటుంబ సభ్యులు, బంధువులు నిందితులను పట్టుకోవాలంటూ స్థానిక పోలీస్‌స్టేషన్‌కు భారీగా చేరుకోవడంతో పాటు, పాతబస్టాండ్ సెంటర్‌లో రోడ్డుపై బైఠాయించారు. కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతుడి బంధువులతో చర్చించి పరిస్థితిని చక్కదిద్దారు.

ఈరోజు

'స్పందన'

కోడుమూరు రూరల్ : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జయన్న ఆదివారం తెలిపారు. స్పందన కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు ఏవైనా సమస్యలుంటే అర్జీల రూపంలో సమర్పిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

స్పందనకు హాజరుకాకపోతే చర్యలు

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమానికి మండల అధికారులందరూ తప్పనిసరిగా హాజరవ్వాలని తహసీల్దార్ శేషఫణి అన్నారు. గైర్హాజరయ్యే అధికారులపై నివేదికలను కలెక్టర్ కార్యాలయానికి పంపించడంతో పాటు ఉన్నతాధికారులకు చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేస్తామని హెచ్చరించారు.

గూడూరు: ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వెంకటరమణ ఆదివారం ప్రకటనలో తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై వినతులు అందజేసి పరిష్కరించుకోవాలని సూచించారు. మండల, గ్రామ స్థాయి అధికారులు హాజరు కావాలని సూచించారు.

కల్లూరు: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ టీవీ రమేష్ బాబు తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలకు ఏవైనా సమస్యలుంటే అర్జీలను సమర్పిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

కొత్తకోటలో వై ఏపీ నీడ్స్ జగన్

సి.బెళగల్: మండల పరిధిలోని కొత్తకోట గ్రామంలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని జేసీఎస్ మండల కన్వీనర్ సీబీ తులసిరెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ సచివాలయంలో ఉదయం 11 గంటలకు కార్యక్రమం ఉంటుందని, ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ హాజరు అవుతున్నారన్నారు.గ్రామ ప్రజలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

'గడప గడపకు మన ప్రభుత్వం'

ఓర్వకల్లు : మండలంలోని నన్నూరు గ్రామ సచివాలయం-1 పరిధిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివనాగప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ సర్పంచు బ్రహ్మయ్య ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. వివిధ శాఖలకు చెందిన మండలస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.



వర్కూరులో పూతకాయలతో కళకళలాడుతున్న టమోట




కల్లపరిలో కళకళలాడుతున్న మిరప

జోరుగా కూరగాయల సాగు

కోడుమూరు రూరల్: మండలంలోని వర్కూరు, పులకుర్తి, కల్లపరి, ప్యాలకుర్తి, అల్లినగరం, లద్దగిరి గ్రామాల్లోని రైతులు బోరుబావుల కింద అత్యధికంగా కూరగాయల పంటలను సాగు చేస్తున్నారు. రెండేళ్ల నుంచి కూరగాయల పంటలకు మార్కెట్‌లో డిమాండ్ ఉండడంతో చాలామంది రైతులు బోరుబావుల కింద సుమారు 560కు పైగా ఎకరాల్లో టమోటా, వంకాయ, మిరప, ఉల్లి, కాకర వంటి కూరగాయల పంటలను సాగు చేశారు. ప్రస్తుతం కూరగాయల పంటలన్నీ పూత, కాయ దశలో ఉండి పచ్చదనంతో కనువిందు చేస్తున్నాయి. వర్షాభావ పరిస్థితుల వల్ల వర్షాధారం కింద సాగు చేసిన పంటలు దెబ్బతిన్నప్పటికీ బోరుబావుల కింద సాగు చేసిన కూరగాయల పంటలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి.

పచ్చదనంతో కళకళలాడుతున్న కాకరకాయ →



విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

సి.బెళగల్: విద్యార్థులు శాస్త్రీయ విజ్ఞానాన్ని పెపొందించుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బలరాముడు సూచించారు. మండల కేంద్రం సి.బెళగల్‌లోని గురుకుల పాఠశాలలో ఆదివారం జీవ, రసాయన, భౌతిక శాస్త్ర, వ్యాయామ విద్యా సాంకేతిక ప్రదర్శన నిర్వహించారు. సర్పంచ్ పాండురంగన్నతో కలిసి ఆయన విద్యార్థులు వివిధ అంశాలపై ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. విద్యార్థులతోనూ ముచ్చటించారు. పాఠశాల విద్యార్థులతో పాటు, స్థానిక కస్తూరిబా బాలికలు సైతం ప్రదర్శనను తిలకించినట్లు పీడీ రాఘవేంద్ర తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ విజేయుడు, అధ్యాపకులు చింతలయ్య, సాయిశంకర్, పీఈటీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సిరులు కురిపిస్తున్న జొన్న!

- రబీలోనూ సాగుకు ఆసక్తి చూపుతున్న రైతులు
- గతంలో ఎన్నడూ లేని విధంగా రెండు పంటలు

గడివేముల: జొన్న సాగు సిరులు కురిపిస్తుంది. రబీలోనూ జొన్న సాగుపై రైతులు అసక్తి చూపుతున్నారు. గతంలో ఖరీఫ్‌లో సాగు చేసి రబీలో విరామం ఇచ్చేవారు. సాగులో మెళకువలు, రైతు భరోసా కేంద్రాల నుంచి ఇస్తున్న సహకారం, ప్రభుత్వం మద్దతు ధర, సకాలంలో వర్షాలు పడటంతో గతం కంటే ఈ ఏడాది ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. మండలంలో మొత్తం 34,382 ఎకరాలు ఉంది. ఖరీఫ్‌లో 20 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. మండలంలో దాదాపు 7 వేల ఎకరాల వరకు జొన్న పంటను సాగు చేశారు. ముఖ్యంగా బూజునూరు, మంచాలకట్ట, చిందుకూరు, గడిగరేవుల, కొరటమద్ది, బిలకలగూడూరు గ్రామాల్లో జొన్న పంట అధికంగా సాగు చేశారు. తక్కువ పెట్టుబడితో తొందరగా చేతికి వచ్చే పంటగా రైతులు ఎన్నుకున్నారు. ఎకరాకు రూ.15 నుంచి 20 వేల వరకు ఖర్చు వస్తుందని రైతులు చెబుతున్నారు. ఎక్కువ శాతం రైతులు జొన్న పంటపైనే ఆసక్తి చూపుతున్నారు. ఎకరాకు రూ.25 నుంచి30 వేల ఆదాయం వస్తుందని తెలిపారు.



గ్రంధివేముల గ్రామంలో సాగుచేసిన జొన్న పంట

లాభాలు బాగున్నాయి



జొన్న సాగులో లాభాలు బాగున్నాయి. నాకున్న ఐదెకరాలతో పాటు మరో 8 ఎకరాలు కౌలు తీసుకున్నా. ఖరీఫ్‌లో జొన్నపంట సాగు చేశా. మంచి దిగుబడి వచ్చింది. వ్యవసాయాధికారుల సూచనల మేరకు జొన్న పంటను వేశాను. ఎకరాకు ఖర్చులు పోను రూ.20 నుంచి 25 వేల వరకు అదాయం వస్తుంది.

–షేక్ చిన్న షాలుమియ్య, రైతు, బూజునూరు గ్రామం

ప్రతిసారి మొక్కజొన్నే సాగు చేస్తున్నా



రబీలో జొన్న సాగుకు ఎక్కువగా అనుకూలంగా ఉంటుంది. రైతుభరోసా అధికారులు మంచి సలహాలు ఇస్తున్నారు. సకాలంలో వర్షాలు పడడంతో నాలుగు ఎకరాలలో జొన్న సాగు చేశా. ప్రభుత్వం ప్రతి పంటకు మద్దతుధర ప్రకటించడంతో ముందుకు వస్తున్నాం. ఆర్బీకే సిబ్బంది సూచనలు పాటిస్తున్నాం.

–దాసరి రాముడు,గడివేముల

మహిళలకు కరాటే సాధన అవసరం



కలర్‌బెల్టులు ప్రదానం చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శాంత

కర్నూలు (టౌన్): మహిళలకు మార్షల్ ఆర్ట్స్ వంటి కరాటే సాధన క్రీడలు అవసరమని సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శాంత అన్నారు. ఆదివారం స్థానిక సుంకేసుల రోడ్డులో ఉన్న సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాలలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ప్రారంభించిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆడపిల్లలు ఆరోగ్యం పెంపొందించుకునేందుకు ప్రతి రోజు క్రమం తప్పకుండా శిక్షణలో పాల్గొనాలన్నారు. అనంతరం బెల్టు పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థినులకు కలర్ బెల్టులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాస్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.